క్లుప్తంగా

కార్యసిద్ధి హనుమాన్ ఆలయ వార్షికోత్సవం



బేతపూడిలో కార్యసిద్ధి హనుమాన్‌ను దర్శించుకుంటున్న భక్తజనం

దేవరాపల్లి: రైవాడ పంచాయితీ శివారు బేతపూడిలో కార్యసిద్ధి హనుమాన్ ఆలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. స్వామివారికి తెల్లవార జాము నుంచి గ్రామస్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు. మహిళల కోలాటం, తప్పెట గుళ్ల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ధర్మకర్త దుక్క ఈశ్వరరావుతో పాటు గ్రామనాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

రావికమతం : మండలంలో గుడ్డిప గ్రామంలో ప్రభుత్వ భూమిలో మండల రెవెన్యూ సిబ్బంది బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సర్వే నెంబర్ 44, 45లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఎంపీటీసీ సభ్యుడు గెంజి సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిబ్రవరి 15న మండల తహసీల్దారు వెంకటరమణ ఆధ్వర్యంలో రెవిన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే నంబర్ 44లో 14.45 ఎకరాలు, సర్వే నెంబర్ 45లో 3.92 ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని నిర్ధారించారు. దీంతో సర్వే నెంబర్ 44,45 లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

చిన్నారులకు గజ్జె పూజా మహోత్సవం



బహుమతి ప్రదానం చేసిన విద్యార్థినులతో ధనం మాస్టర్

నర్సీపట్నం : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం అమృతేశ్వర నాట్య అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు గజ్జె పూజా మహోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో భాగంగా చిన్నారులు శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీనియర్ నాట్య ఉపాధ్యాయుడు ధనం మాస్టర్ విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో అమృతేశ్వర నాట్య అకాడమీ టీచర్ ఉమాదేవి, విద్యార్థినుల తల్లిదండ్రులు, కళాభిమానులు పాల్గొన్నారు.

వీరేశలింగం జయంతి



అయ్యన్న పాఠశాలలో వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న పాఠశాల సిబ్బంది

కె. కోటపాడు: మహిళల విద్య కోసం ఉద్యమించడమే కాకుండా, బాలికల కోసం పాఠశాలను ప్రారంభించిన మహోన్నత వ్యక్తి కందుకూరి వీరేశలింగం అని స్థానిక అయ్యన్న స్కూలు డైరక్టరు నూర్జహన్ అన్నారు. వీరేశలింగం 177వ జయంతిని పురస్కరించుకుని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈయన సేవల గురించి ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుమతి, తెలుగు ఉపాధ్యాయులు బి.వి.రమణమూర్తి, ఉపాధ్యాయులు జ్యోతి పద్మిని పాల్గొన్నారు.

తాండవ పూడికతీత పనులు ప్రారంభం



కొబ్బరి కొట్టి పూడికతీత పనులను ప్రారంభిస్తున్న డీఈ అనురాధ, చైర్మన్ సత్యనారాయణ

నాతవరం : రాజుపేట అగ్రహారం గ్రామ సమీపంలోని తాండవ ప్రధాన కాలువలో పూడికతీత పనులను డీఈ అనురాధ, చైర్మన్ కె.సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. ఈ పనులకు రూ.12 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో కాలంలో పూడికను తొలగిస్తామని డీఈ తెలిపారు. కార్యక్రమంలో జేఈ శ్యామ్‌కుమార్, మండల టీడీపీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

లక్ష్యం పచ్చగా.. మొక్కలు మెండుగా..



రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్న టేకు, వేప, తెల్లమద్ది, ఇతర మొక్కలు



నర్సరీలో రైతులకు అందించేందుకు సిద్ధం చేస్తున్న సరుగుడు నారు



నర్సరీలో మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో లక్ష్మణ్ (ఫైల్)

జిల్లాలో 44 వన నర్సరీల్లో 35 లక్షల మొక్కల పెంపకం

కలెక్టర్ నిర్దేశించిన తక్కువ ధరలకే నర్సరీల నుంచి మొక్కల సరఫరా

గ్రామాల్లో వాతావరణ సమతుల్యత సాధించడమే లక్ష్యం

జూన్ నుంచి రైతులకు పంపిణీకి చర్యలు

కె.కోటపాడు : సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో జిల్లాలో 44 చోట్ల వన నర్సరీలలో మొక్కల పెంపకం చేపడుతున్నారు. సరుగుడుతో పాటు ఇతర టాల్ ప్లాంటేషన్ మొక్కలు 35 లక్షల వరకూ పెంచుతున్నారు. కె.కోటపాడు మండలంలో సింగన్నదొరపాలెం, రామచంద్రపురం, కొత్తూరు, బత్తివానిపాలెం ప్రాంతాలలో సామాజిక అటవీశాఖ ఆధ్వర్యంలో వననర్సరీలో రైతులకు అందించేందుకు మొక్కల పెంపకం నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలు విరివిగా మొక్కల పెంపకాన్ని చేపట్టడం ద్వారా వాతావరణ సమతుల్యత సాధించడానికి సోషల్ ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నర్సరీలలో గల మొక్కలను రైతులకు, ఉపాధి కూలీలకు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా నాటడానికి వీలుగా జిల్లా కలెక్టర్ నిర్దేశించిన తక్కువ ధరలకు పంపిణీ చేయనున్నారు.

- ప్రస్తుతం కె.కోటపాడు మండలంలో సింగన్నదొరపాలెం, కొత్తూరు, రామచంద్రపురం, బత్తివానిపాలెంలలో సామాజిక అటవీశాఖ ఆధ్వర్యంలో నర్సరీ ఏర్పాటు చేసింది. నాలుగు వన నర్సరీలలో నాలుగు లక్షల సరుగుడు, మరో లక్షా యాభై వేల మొక్కలైన వేప, ఫెల్టోఫారం, రావి, కాము, బాదం, జంబో నేరడి, గంగిరేవు, తెల్లమద్ది, సిల్వర్‌ఓక్ మొక్కలను పెంచుతున్నారు. ప్రధానంగా మండలంలో మెట్ట ప్రాంత భూములు కావడంతో సరుగుడు నాట్లను జూన్ నెలలో కురిసే వర్షాల సమయాల్లో వేస్తారు. నారు రైతులకు తక్కువ ధరలకు ఇవ్వడం వల్ల నర్సరీలో గల నారుకు మంచి డిమాండ్ ఉండనుంది.
- మాడుగుల మండలంలో ముకుందపురం, జంపెన గ్రామాల్లో వన నర్సరీలు ఉన్నాయి. ఈ రెండు నర్సరీలలో లక్ష సరుగుడు, 10 వేల టాల్ ప్లాంటేషన్ మొక్కలు పెంపకం చేపడుతున్నారు.
- చీడికాడ మండలంలో జైతవరం గ్రామంలో వన నర్సరీ ఉంది.. ఈ కేంద్రంలో 50 వేల సరుగుడు, 5 వేల టాల్ ప్లాంటేషన్ మొక్కలు ఉన్నాయి.

ఆరోగ్యవంతమైన నారు

రైతులు, ప్రభుత్వ కార్యాలయాలు పరిసరాలతో **పాటు** రోడ్డుకు ఇరువైపులా నాటేందుకు సిద్ధం చేస్తున్న మొక్కలు ఆరోగ్యవంతంగా ఉండేటట్టుగా సిబ్బంది చర్యలు చేపడుతున్నారు. ఈ నర్సరీలో ఆరు నెలల పాటు పెంచిన సరుగుడును రైతులకు అందించనున్నారు. మిగిలిన మొక్కలను నర్సరీలో రెండేళ్ల పాటు ఆరోగ్యవంతంగా పెంచి రైతులకు అందిస్తున్నారు. వేసవి కాలంలో మొక్కలు వడలకుండా ఉండేందుకు ప్రతి రోజూ నీటి తడులను మొక్కలకు అందిస్తూ ఆరోగ్యకరంగా ఉండేటట్టు వన సంరక్షకులు చర్యలు తీసుకుంటున్నారు.

కలెక్టర్ నిర్దేశించిన ధరలకు పంపిణీ



అనకాపల్లి జిల్లాలో 44 వన నర్సరీలలో సుమారు 35 లక్షల మొక్కల పెంపకాన్ని చేపడుతున్నాం. వీటిలో 33 లక్షల సరుగుడుతో పాటు మరో రెండు లక్షల వివిధ రకాలైన జాతుల మొక్కల పెంపకాన్ని చేస్తున్నాం. రైతులకు, ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం ఉంటే జిల్లా కలెక్టర్ నిర్ణయించిన ధరలకు అందించనున్నాం. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ భూముల్లో మొక్కలు నాటేందుకు ఆయా అధికారుల నుంచి సిఫార్సు పత్రాన్ని తీసుకువస్తే వారికి కూడా ఇవ్వనున్నాం. రైతులకు ఆరోగ్యకరమైన మొక్కలను అందించడం వల్ల వాటి పెంపకంతో మంచి ఆదాయం వారికి సమకూరనుంది. నర్సరీల్లో గల టాల్ ప్లాంటేషన్ మొక్కలను ఎన్‌టీపీసీ నిధులతో రోడ్లకిరువైపులా నాటి పచ్చదనాన్ని పెంచే చర్యలు చేపడుతున్నాం.

– జి.లక్ష్మణ్, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో

ప్రతి రోజూ నీటి తడులు



వన నర్సరీలలో గల మొక్కలకు ప్రతి రోజూ పైప్‌ల ద్వారా నీటి తడులను అందిస్తున్నాం. వేసవి ఉష్ణోగ్రతల బారిన మొక్కలు వడలకుండా చర్యలను తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూన్ నెలలో మొక్కలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– చిరికి గోవింద, వన సేవకుడు, కొత్తూరు

దేవరాపల్లిలో పీజీఆర్ఎస్ నేడు

దేవరాపల్లి : దేవరాపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి పాల్గొంటారని స్థానిక ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరిస్తారన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు



బంగారుమెట్టలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బుచ్చెయ్యపేట : రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించి ఆరోగ్యకరమైన పంట దిగుబడులు సాధించాలని ఆ శాఖ డీపీఎం లచ్చన్న తెలిపారు. బుధవారం బంగారుమెట్ట గ్రామంలో ప్రకృతి వ్యవసాయం పంట దిగుబడులు, పచ్చిరొట్ట ఎరువులపై రైతులకు అవగాహన కల్పించారు. తొలకరి వర్షాలు కురిసిన తరువాత ఎకరాకు 12 కేజీల జనుము, జీలుగ తదితర పచ్చిరొట్ట విత్తనాలను జల్లుకోవాలన్నారు. 45 రోజులు పెంచిన పచ్చిరొట్ట ఎరువులను వరి పంట వేయకముందు దమ్ములో కలిపి దున్నాలన్నారు. నవధాన్యాల పంటల వల్ల పశువులకు గ్రాసంతో పాటు భూమి గుల్లబారడం, కలుపు నివారణ తగ్గి భూసారం పెరుగుతుందన్నారు. పలువురు రైతులకు నవధ్యాన్యాల కిట్లు అందించారు. ఏవో భాస్కరరావు, సిబ్బంది నాగమణి, చిన్న, నాయుడుబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఫీల్డు అసిస్టెంట్ల నిరసన

28 నుంచి విధులు బహిష్కరిస్తామని హెచ్చరిక

చోడవరం : తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని కోరుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఫీల్డు అసిస్టెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు చోడవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి, ఎంపీడీవో ఆంజనేయులకు వినతిపత్రం, సమ్మె నోటీసు ఇచ్చారు. తామంతా ఈ విభాగంలో 18 ఏళ్లుగా పనిచేస్తున్నామని, తమను పంచాయతీ శాఖ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఫీల్డు అసిస్టెంట్లను ఎఫ్‌టీఈలు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించి హెచ్ఆర్ పాలసీ, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా, గ్రాట్యూటీ వంటి సంక్షేమ పథకాలు వర్తించేలా చేయాలని, మండలాన్ని యూనిట్‌గా తీసుకొని అతమకు అంతర్గత బదిలీలు చేయాలని, స్థానికంగా రాజకీయ ఒత్తిళ్ల తలెత్తకుండా చూడాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మరణించిన ఫీల్డు అసిస్టెంట్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని, తమకు జీతభత్యాలు పెంచాలని, విద్యార్హతలను బట్టి పదోన్నతులు కలిప్తూ కంప్యూటర్ ఆపరేటర్లుగా, టెక్నికల్ అసిస్టెంట్లుగా నియమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో భాగంగా ఈనెల 21వ తేదీన పెన్‌డౌన్ చేసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని సంఘనాయకులు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 28 నుంచి పూర్తిగా విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఆందోళనలో సంఘ మండల అధ్యక్షుడు బర్ల సంతోష్, కార్యదర్శి శరగడం రాము, ఉపాధ్యక్షుడు రెల్లి శ్రీనివాస్, కోశాధికారి మైచర్ల గవరాజు, రమేష్ పాల్గొన్నారు.



చోడవరం ఎంపీడీవోకి వినతిపత్రం, సమ్మె నోటీసు ఇస్తున్న చోడవరం ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డు అసిస్టెంట్లు

నల్ల బ్యాడ్జీలతో నిరసన

బుచ్చెయ్యపేట: డిమాండ్లు పరిష్కరించి ఆదుకోవాలంటూ జాతీయ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు నల్ల బ్యాడ్జీలు ధరించి మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. 2016 నుంచి విధులు నిర్వహిస్తున్నా నేటికీ ఒక్క రూపాయి కూడా జీతం పెంచకుండా పని చేయిస్తున్నారన్నారు. 16 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న వారిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు ప్రస్తుతం అందిస్తున్న రూ. 5,750 జీతాన్ని రూ.18 వేలకు పెంచాలని, విధి నిర్వహణలో మృతి చెందిన ఫీల్డ్ సిబ్బంది కుటుంబ సభ్యులకు రూ.పది లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించడంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, కుటుంబ సభ్యులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, నెల వారి టార్గెట్‌లు రద్దు చేయాలని, అర్హతవున్న వారికి కంప్యూటర్ ఆపరేటర్, టెక్నికల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు కల్పించాలని, అంతర్గత బదిలీలకు అవకాశం కల్పించాలని నినాదాలు చేశారు. ఎంపీడీవో విజయలక్ష్మికి మండల ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం అధ్యక్షుడు యన్నెంశెట్టి సన్యాసిరావు, ఉపాధ్యక్షుడు కొల్లి కిత్తంనాయుడు, కార్యదర్శి తాటికొండ శ్రీను, కొత్తపల్లి సరళ వినతి పత్రం అందించారు.



బుచ్చెయ్యపేటలో ఎంపీడీవోకు వినతి పత్రం అందిస్తున్న ఫీల్డ్ సిబ్బంది

వైభవంగా వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ట

దేవరాపల్లి : తెనుగుపూడి శివారు గొల్లపేటలో వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ట బుధవారం వైభవంగా జరిగింది. పాకల కామేశ్వరరావు, బొమ్మిరెడ్డిపల్లి సర్వేశ్వరరావు, యల్లాప్రగడ నాగేష్ తదితర వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ తెల్లవారు జాము నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ట అనంతరం భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు స్వామి వారిని దర్శించుకొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, యాదవ సంఘం నాయకులు మాజీ డిప్యూటీ సీఎంను సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కిల్లాన శ్రీనివాసరావు యాదవ్, ఎ.కొత్తపల్లి, గరిశింగి, వెంకటరాజుపురం గ్రామాల సర్పంచ్‌లు చింతల సత్య వెంకటరమణ, గూడెపు రాము, దాసరి సంతోష్‌కుమార్, తెనుగుపూడి ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా నాయుడు, యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాము స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. మహిళల కోలాటం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తజనాన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విస్సారపు అప్పారావు, నర్సిబాబు, యాదవ సంఘం పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



వేణుగోపాలస్వామిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

పోషకాహారంతో పాటు అక్షర చైతన్యం

మాడుగుల : అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంలో పాటు అక్షర చైతన్యం మరింత మెరుగ్గా చేపట్టాలని సర్పంచ్ కొసిరెడ్డి క్రిష్ణమూర్తి అన్నారు.. మాడుగుల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీదేవి, సూపర్‌వైజర్ చిన్నమ్మలు ఆధ్వర్యంలో జమ్మాదేవిపేట పరిధిలో ఉన్న గాదిరాయి, జేడీపేట గవరవరం గ్రామాల్లో ఉన్న ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు సంయుక్తంగా బుధవారం జేడీపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార పక్షోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. అందుబాటులో ఉన్న ఆకు కూరలతో తయారు చేసిన పౌష్టికాహార పాదార్థాలతో పాటు చిన్నారులకు అందమైన బొమ్మల కొలువులు తయారు చేసి ప్రదర్శనగా ఉంచడంతో అంగన్‌వాడీ కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పద్మ, సూర్యమణి, రమ, పార్వతి, రాజ్యలక్ష్మి, మహిళాపోలీసు తేజ, ఏఎన్ఎం ప్రభ పాల్గొన్నారు.



పౌష్టికాహార పక్షోత్సవాల్లో మాట్లాడుతున్న సర్పంచ్ తదితరులు

దంచికొట్టిన వాన – సేద తీరిన ప్రజలు

బుచ్చెయ్యపేట : మండలంలో వర్షం దంచి కొట్టింది. సాయంత్రం చిరు జల్లులతో ప్రారంభమై అధిక వర్షం కురిసింది. అప్పటి వరకు తీవ్ర ఎండ ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షం కురిసి వాతావరణం చల్ల బడటంతో సేద తీరారు. బుచ్చెయ్యపేట, వడ్డాది,రాజాం రోడ్లపై వరద నీరు ప్రవహించింది.

చీడికాడ : మండలంలోని బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులతో పలు గ్రామాల్లో చెట్లు విరిగి పడి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపుగా అన్ని గ్రామాల్లో మూడు రోజులుగా మధ్యాహ్నం సమయంలో ఇదురుగాలులతో వర్షం కురుస్తోంది.

గొలుగొండ: మండలంలో జోగుంపేట, అమ్మపేట, కొత్తమల్లంపేట, చిన్నయ్యపాలెం, సాలికమల్లవరం తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. గంట పాటు కురిసిన వర్షం కారణంగా రోడ్లు జలమయమయ్యాయి. వర్షం మెరక పంటలకు ఎంతో మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



వి.బి.పేటలో రోడ్డుపై కూలిన చెట్టు

విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాడుగుల రూరల్ : మండలంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాత్రి 8.30 గంటలకు విద్యుత్ పునరుద్ధరించారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం



బేతపూడిలో బాధిత కుటుంబ సభ్యులకు నగదు సహాయం చేస్తున్న హెల్ప్‌ఫుల్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు

దేవరాపల్లి : రైవాడ పంచాయతీ శివారు బేతపూడిలో నిరుపేద కుటుంబానికి స్థానిక యువత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బేతపూడికి చెందిన బాయశెట్టి రాజులమ్మ ఇటీవల మృతి చెందగా, ఆమె కంటే ముందే ఆమె కుమారుడు రమణ మృతి చెందాడు. అనారోగ్యంతో మృతి చెందిన రాజులమ్మ అంత్యక్రియలు సైతం చేయలేని స్థితిలో కోడలు వరలక్ష్మి ఉండగా, కొందరు దాతల సహకారంతో అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఇదే గ్రామానికి చెందిన హెల్ప్ ఫుల్ హ్యాండ్స్ సామాజిక వారధి అనే స్వచ్ఛంద సంస్థ సభ్యులు రూ. 6,160 నగదును సమకూర్చి వరలక్షికి బుధవారం అందజేశారు.

శత శాతం ప్రకృతి వ్యవసాయమే లక్ష్యం

రావికమతం : కొట్నాబిల్లి గ్రామంలో శత శాతం ప్రకృతి వ్యవసాయం చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని మండల వ్యవసాయాధికారి రూప తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వెలుగు సిబ్బందితో కలిసి సచివాలయంలో బుధవారం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని శతశాతం ప్రకృతి వ్యవసాయంగా మార్చేందుకు జిల్లా కలెక్టర్ ఎంపిక చేశారని తెలిపారు. తొలకరిలో అన్ని రకాల పంటలు ప్రకృతి సేద్యం విధానంలో పండించడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇందుకోసం సహజ సిద్ధంగా దొరికే వనరులతో కషాయలను, గోమూత్రం, ఆవు పేడతో తయారు చేసే ఎరువులు వాడడం వల్ల అధిక దిగుబడులు వస్తాయని వివరించారు. రసాయన ఎరువులు వాడడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో రూప

ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ

మాకవరపాలెం : మండలంలో చామంతిపురం పంచాయతీ శివారు వెంకటాపురంలో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ బుధవారం ఆవిష్కరించారు. నర్సీపట్నం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వికాస్ సతీష్, ఇందిరా దంపతులు ఏర్పాటు చేసిన హనుమాన్ విగ్రహా ఆవిష్కరణ మహోత్సవానికి మాజీ ఎమ్మెలే హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు, మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, సర్పంచ్ బొడ్డు గోవిందరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

రెండు పోస్టులకు 35 మంది పోటీ

బుచ్చెయ్యపేట : వడ్డాది గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న బాలికల వసతి గృహంలో వంట కుక్ పోస్టులకు మహిళలు పోటీ పడ్డారు. వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్‌లోనే బాలికల వసతి గృహం ఏర్పాటు చేస్తున్నారు. ఈ వసతి గృహంలో హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు 35 మంది దరఖాస్తు చేసుకున్నారు. హెడ్ కుక్‌కు 14 మంది, అసిస్టెంట్ కుక్ పోస్టుకు 21 మంది దరఖాస్తులు చేసుకోగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవోలు బొంజుబాబు, కాశీ విశ్వేరరావులు ఇంటర్వ్యూలు నిర్వహించి డీఈవో కార్యాలయానికి లబ్ధిదారుల వివరాలు పంపించారు. డీఈవో ఆదేశాలతో ఎంపికైన వారి వివరాలను ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.



బుచ్చెయ్యపేటలో ఇంటర్వ్యూలకు వచ్చిన మహిళలు

గ్యాస్ సిలిండర్ ప్రమాదాలపై అవగాహన



గ్యాస్ సిలిండర్ ప్రమాదాలపై మహిళలకు వివరిస్తున్న ఫైర్ అధికారి రాజేశ్వరరావు

మాడుగుల : జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 3వ రోజు బుధవారం మాడుగులలో అపార్టుమెంట్లలో నివాసముంటున్న మహిళలకు గ్యాస్, ఎలక్ట్రికల్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రతలతో పాటు ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రతలపై అగ్నిమాపక సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారి వి. రాజేశ్వరరావు, సిబ్బంది భోగేశ్వరరావు, వర్మ, మూర్తి, వరహాలరావు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో వృద్ధురాలికి గాయాలు

బుచ్చెయ్యపేట : రాజాం గ్రామంలో బుధవారం సాయంత్రం మరిసా అప్పలకొండ అనే వృద్ధురాలు తన ఇంటి వద్ద వరండాలో కూర్చుని ఉండగా పిచ్చికుక్క ఆమెపై దాడి చేయడంతో గాయపడింది. అడ్డుకున్న వారిపై కూడా పిచ్చికుక్క దాడి చేయడడంతో గ్రామస్తులు దానిని కర్రలతో కొట్టి చంపేశారు.